సింగరేణి జాయింట్ వెంచర్‌ను ఒప్పుకోం

తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : రామగుండం థర్మల్ ప్లాంట్‌ను సింగరేణి భాగస్వామ్యంతో నిర్మించేందుకు ఎట్టి పరిస్థితిలో ఒప్పుకునేది లేదని, ఈ ప్లాంట్‌ను జెన్‌కో ద్వారానే నిర్మించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం చేసింది. జాయింట్ వెంచర్ అంటే ప్రైవేటీకరణను ప్రోత్సహించడమేనని జేఏసీ నేతలు ఆరోపించారు. జేఏసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం ఖైరతాబాద్‌లోని విద్యుత్తు సౌధలో జేఏసీ నేతలు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ.. మూడేండ్లుగా జెన్‌కో లాభాల్లో నడుస్తున్నదని, 2020-21లో రూ. 168 కోట్లు, 2021-22లో రూ.394.46 కోట్లు, 2022-23లో రూ.472.94 కోట్ల లాభాలను ఆర్జించిందని తెలిపారు. జెన్‌కో ఈక్విటీతోనే రామగుండంలో నిర్మించతలపెట్టిన 800 మెగావాట్ల ప్లాంట్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు, కో కన్వీనర్ బీసీ రెడ్డి, వజీర్, మాజీద్, రమేశ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉత్పత్తి లక్ష్యం పెంపు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : బొగ్గు ఉత్పత్తి, రవాణాలో సింగరేణి లక్ష్యాన్ని క్రమంగా పెంచుకుంటున్నది. ఇది వరకు రోజుకు రెండు లక్షల బొగ్గును ఉత్పత్తి, రవాణా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ.. తాజాగా దీనిని 2.1 లక్షల టన్నులకు పెంచుకున్నది. బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని కంపెనీ సీఎండీ ఎన్ బలరాం ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో పాటు రోజుకు 15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని అన్ని ప్రాంతాల జీఎంలకు ఆయన ఆదేశాలిచ్చారు. భారీ వర్షాలతో కొద్ది రోజుల పాటు సింగరేణిలో ఉత్పత్తి నిలిచిపోగా, వార్షిక లక్ష్యాన్ని చేరుకోవడంలో భాగంగా ఈ లక్ష్యాన్ని నిర్దేశించారు.

● నల్లబ్యాడ్జీలతో కేటీపీపీ ఉద్యోగుల నిరసన



థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాలను జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని, సింగరేణి భాగస్వామ్యాన్ని అంగీకరించబోమని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులోని కేటీపీపీలో శనివారం ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. -గణపురం

చేనేత రుణమాఫీ ఏమాయే..!

- ఇచ్చిన హామీని బుట్టదాఖలు చేస్తున్న కాంగ్రెస్ సర్కారు
- తీవ్ర ఆవేదనలో చేనేత కార్మికులు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చేనేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాలు మాఫీ చేస్తామని మాట ఇచ్చిన ప్రభుత్వం.. ఇంతవరకు పట్టించుకోకపోవడమే ఇందుకు కారణమవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 10 వేల మంది కార్మికులు ఈ మాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 'చేనేత పాలసీ' అనేది ఏదీ లేదని చేనేత కార్మికులు మండిపడుతున్నారు. చేనేతలను సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని చేనేత కార్మికసంఘం రాష్ట్ర నాయకులు కూరపాటి రమేశ్, చెరుకు స్వామి విమర్శిస్తున్నారు. మరికొన్ని డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు.

- చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి కల్పించాలి.
- చేనేతల కోసం రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలనే డిమాండ్‌ను నెరవేర్చాలి
- త్రిఫ్ట్ ఫండ్, యూరన్ సబ్సిడీ, నేతన్నకు బీమా పథకాలు అమలు చేయాలి
- బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- వస్త్రనిల్వలు వెంటనే కొనుగోలు చేయాలి
- పర్కర్ టూ ఓనర్, జనతా వస్త్ర పథకాలను అమలు చేయాలి
- పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి
- యూరన్ సబ్సిడీ నిధులను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలి
- ప్రతి నేతన్నకు పెట్టుబడిసాయం కింద రూ.5 లక్షలు అందించాలి
- ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమైన వస్త్రాలను రాష్ట్రంలో ఉత్పత్తి చేయించాలి.

హరీశ్ (ఫైల్)

సురేశ్ (ఫైల్)

హేమలత (ఫైల్)

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు కుటుంబం బలి

- రూ.30 లక్షలకుపైగా కుమారుడి అప్పులు
- 20 గుంటల భూమి అమ్మి అప్పుల చెల్లింపు
- మనస్తాపంతో కుమారుడితోపాటు తల్లిదండ్రుల ఆత్మహత్య
- నిజామాబాద్ జిల్లా వడ్డేపల్లిలో విషాదం

ఎడపల్లి, అక్టోబర్ 5: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరో కుటుంబం బలైంది. రూ.లక్షలు పోగొట్టిన ఓ యువకుడితోపాటు అతడి తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన శనివారం నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన రంగనవేణి సురేశ్ (55), హేమలత (48) దంపతులకు ఇద్దరు సంతానం. మెదడువాపు వ్యాధితో కూతురు చిన్నప్పుడే మృతి చెందింది. ఏకైక కుమారుడు హరీశ్ (22) నిజామాబాద్‌లో ఉంటూ పెట్రోల్ బంక్‌లో పని చేసేవాడు. ఆర్నెళ్ల క్రితం పని మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. సురేశ్ దంపతులు చిన్న కిరాణషాపు నడుపుతూ వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. కొత్త ఇల్లు కట్టుకుందామన్న ఆశతో గృహ నిర్మాణాన్ని ప్రారంభించారు. కుమారుడు హరీశ్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి భారీగా అప్పులు చేశాడు. దీంతో తల్లిదండ్రులు ఇంటి నిర్మాణాన్ని ఆపేశారు. హరీశ్ చేసిన రూ.30 లక్షలకుపైగా అప్పులను తమకున్న 20 గుంటల భూమిని అమ్మేసి తీర్చారు. అయినప్పటికీ కుమారుడిలో మార్పు రాలేదు. నలుగురిలో తిరగలేక మనస్తాపం చెందిన తల్లిదండ్రులు, కుమారుడు శుక్రవారం రాత్రి ఉరేసుకున్నారు. తెల్లారినా ఎలాంటి అలికిడి లేకపోవడంతో ఇరుగుపొరుగు ఇంటి వెనుక నుంచి చూడగా వేలాడుతూ కనిపించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉగాండాలో జనగామవాసి హత్య

సెక్యూరిటీ గార్డు జరిపిన కాల్పుల్లో ప్రాణాలొదిలిన తిరుమలేశ్

తిరుమలేశ్ (ఫైల్)

జనగామ చౌరస్తా, అక్టోబర్ 5 : ఉగాండా దేశంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ప్రాజెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న జనగామ వాసి ఇటికాల తిరుమలేశ్ (41) శుక్రవారం అక్కడ హత్యకు గురయ్యాడు. మృతుడి తమ్ముడు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రంలోని గిర్నిగడ్డ ఏరియాకు చెందిన తాపీ మేస్త్రీ ఇటికాల కిష్టయ్య-కిష్టమ్మ దంపతుల పెద్ద కుమారుడు తిరుమలేశ్ నల్లగొండ జిల్లాకు చెందిన రాయల్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 2014 నుంచి ప్రాజెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ కంపెనీకి ఉగాండాలోని నమ్మసాలలో బ్రాంచ్ కార్యాలయం ఉండటంతో 15 నెలల నుంచి భార్య, కుమారుడితో కలిసి తిరుమలేశ్ అక్కడే ఉంటున్నాడు. గురువారం ఉదయం 9.30 గంటలకు (ఉగాండా కాలమానం ప్రకారం) డ్యూటీకి వెళ్లాడు. అక్కడ కొత్తగా విధుల్లో చేరిన సెక్యూరిటీ గార్డు ఓపియో మద్యం మత్తులో గాల్లోకి కాల్పులు జరుపుతుండగా సహోద్యోగులతో కలిసి తిరుమలేశ్ బయటకు వచ్చాడు. సెక్యూరిటీగార్డు విచక్షణ కోల్పోయి తిరుమలేశ్‌పైకి కాల్పులు జరపగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తిరుమలేశ్ భార్య సునీత, కుమారుడు వరుణ్ ఉగాండాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. కాగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో వారిని పరామర్శించారు.

టీ కొట్టు శివకు ఐదు కొలువులు

- పోటీ పరీక్షల్లో పెద్దపల్లి జిల్లా ధర్మారం యువకుడి సత్తా
- గత మార్చిలో గురుకుల జేఎల్, పీజీటీ, టీజీటీల్లో ప్రతిభ
- తాజాగా జేఎల్, డీఎస్సీలో విజయ ధంకా

మహేశ్ కుమార్

ధర్మారం, అక్టోబర్ 5: ఓ పేదింటి బిడ్డ.. ప్రభుత్వ కొలువులు కొల్లగొట్టాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులతో కొన్నాళ్లు టీకొట్టు నడిపిన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన ఉడాన్ శివ మహేశ్ కుమార్.. ఆరు నెలల్లోనే ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సత్తాచాటాడు. ధర్మారానికి చెందిన ఉడాన్ సుశీల-లక్ష్మణ్ దంపతులకు శివ మహేశ్ రెండో కొడుకు. ధర్మారంలో చదువుకుంటూనే తల్లిదండ్రులకు సాయపడేవాడు. 2014లో సునీతను వివాహం చేసుకున్నాడు. 2020లో పీజీ పూర్తిచేశాడు. కరోనా టైంలో రాజారాంపల్లిలో టీకొట్టు నడిపాడు. తర్వాత దానిని వదిలేసి తల్లిదండ్రులు, మిత్రుల సహకారంతో 2022లో జూనియర్ లెక్చరర్ ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకున్నాడు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో గురుకులాల లెక్చరర్, టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా.. అదే ఏడాది ఆగస్టులో పరీక్షలు రాశాడు. గత మార్చిలో ఫలితాలు రాగా.. జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ కొలువులకు ఎంపికయ్యాడు. జూనియర్ లెక్చరర్ పోస్టును ఎంపిక చేసుకొని ప్రస్తుతం నిర్మల్ జిల్లా మామడలోని గురుకులంలో పనిచేస్తున్నాడు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 సెప్టెంబర్‌లో నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ ఉద్యోగాల భర్తీ పరీక్ష, ప్రస్తుత ప్రభుత్వం ఆగస్టు 2024లో నిర్వహించిన డీఎస్సీ పరీక్షలు రాసి ప్రతిభ చాటాడు. ఇటీవలే విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంక్, డీఎస్సీ ఫలితాల్లో పెద్దపల్లి జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ఈ విజయం తన తల్లిదండ్రులకే అంకితమని శివమహేశ్ తెలిపారు.

నిలిచిన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల వెరిఫికేషన్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): పలు జిల్లాల్లో డీఎస్సీలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిలిచిపోయింది. కొన్ని జిల్లాల్లో ఇంకా 1:3 జాబితాలు విడుదల కాలేదు. కోర్టుకేసుల కారణంగా నిలిచినట్టు అధికారులు ప్రకటించారు. శనివారం వరకు (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్, భాషాపండితులు, పీఈటీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాగా, స్పెషల్ ఎడ్యుకేషన్ వెరిఫికేషన్ పూర్తికాలేదు. కోర్టుకేసులు లేని జిల్లాల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తిచేశామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి తెలిపారు.

- నల్లగొండలో ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాలేదు. కానీ ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ జాబితాలో 31కి 29 మంది హాజరయ్యారు.

అమ్మవారికి గండ్ర దంపతుల పూజలు

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 5 : మంజూర్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మహా చండీ యాగంలో భాగంగా శనివారం అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

యాగంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులు

ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలి

ములుగురూరల్, అక్టోబర్ 5 : గ్రామాల్లో వైద్య సిబ్బంది హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో వైద్య సిబ్బందికి హెచ్ఐవీ టెస్టింగ్ విధానాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం హెచ్ఐవీ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ భవ్యశ్రీ, వైద్య సిబ్బంది సాంబయ్య, జ్యోతి, సారయ్య, సాయి ఉన్నారు.

ఇసుక లారీలను అడ్డుకొని రైతుల ధర్నా

మహదేవపూర్, అక్టోబర్ 5 : మండలంలోని అంబట్‌పల్లి గ్రామంలో ఇసుక లారీలతో దుమ్ము, ధూళి కారణంగా తమ పంట పొలాలు నాశనమవుతున్నాయని రైతులు శనివారం ఇసుక లారీలను అడ్డుకొని ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. పంటలపై దుమ్ము పేరుకోవడంతో ఎన్ని మందులు కొట్టినా ఫలితం ఉండడం లేదని పేర్కొన్నారు. లారీలు గ్రామం నుంచి వెళ్లేందుకు నిర్ణీత సమయం కేటాయించినప్పటికీ నిబంధనలు పాటించడం లేదని, దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమిలో కట్టిన ఇల్లు తొలగింపు

వెంకటాపురం(నూగూరు), అక్టోబర్ 5 : బీసీ మర్రిగూడెం గ్రామంలోని రంగరాజపురం కాలనీలో ప్రభుత్వానికి చెందిన సర్వే నంబర్ 4లోని భూమిలో నిర్మించిన ఇంటిని శనివారం రెవెన్యూ అధికారులు తొలగించారు. తహసీల్దార్ లక్ష్మీరాజయ్య మాట్లాడుతూ సర్వే నంబర్ 4లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇల్లు నిర్మిస్తుండగా విషయం తెలుసుకొని ఇంటిని తొలగించి ప్రభుత్వ స్థలం పేరుతో బోర్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ

మహదేవపూర్, అక్టోబర్ 5 : మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో మల్టీపర్పస్ వర్కర్లకు మంచి నీటి స్వచ్ఛత గుర్తింపుపై శిక్షణ ఇచ్చారు. వాటర్ ట్యాంక్‌ల శుద్ధి, క్లోరినేషన్‌తో పాటు పలు అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో డీఈఈ రమేశ్, ఏఈ పీ రాజశేఖర్, నిపుణులు రవీందర్ రెడ్డి, సదానందం, రమేశ్, వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కాళేశ్వరం జేజే మహేష్‌కు ఈవోగా ప్రమోషన్

కాళేశ్వరం, అక్టోబర్ 5 : కాళేశ్వరం ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన రేవెల్లి మహేష్‌కు ఈవోగా ప్రమోషన్ వచ్చింది. ఈ మేరకు హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శనివారం సాయంత్రం ప్రమోషన్ పత్రాలు అందజేశారు. భూపాలపల్లి అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో పోస్టింగ్ ఇచ్చారు.

ఘణపురంలో శిథిలావస్థకు చేరిన అటవీశాఖ కార్యాలయ భవనం

ఘణపురం కాలనీలోని దూలపురం అటవీశాఖ రేంజ్ కార్యాలయం

అడవుల సంరక్షణపై నీలినీడలు

- వెంకటాపురంలో వాజేడు, దూలపురం రేంజ్ కార్యాలయాల నిర్వహణ
- ఇన్‌చార్జి పాలనలోనే దూలపురం రేంజ్
- ఖాళీగా బీట్ ఆఫీసర్ పోస్టులు
- నిరుపయోగంగా ఘణపురం కాలనీ నివాస భవనాలు

వాజేడు, అక్టోబర్ 5 : వాజేడు ఏజెన్సీలో అడవుల సంరక్షణపై నీలినీడలు కమ్ముకున్నాయి. సిబ్బంది కొరతతో అక్రమార్కులపై నిఘా కొరవడింది. ఆ శాఖలో ఖాళీలను భర్తీ చేయాల్సి ఉండగా అధికారులు నిమ్మకునీరెత్తి నట్లు వ్యవహరిస్తున్నారు. కొందరు అధికారులు తమకు కేటాయించిన బీట్ల పరిధిలో ఉన్న క్వార్టర్లలో నివాసం ఉండకుండా ఏటూరునాగారం, వెంకటాపురం మండలాల నుంచి రాకపోకలు సాగిస్తుండడంతో ఇదే అదనుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన అక్రమార్కులు కలపను అక్రమంగా తరలించుకపోతున్నారు.

పేరు ఇక్కడ.. నిర్వహణ అక్కడ

జిల్లాల విభజనకు ముందు 2016 సెప్టెంబర్‌కు పూర్వం వెంకటాపురం అటవీశాఖ రేంజ్ పరిధిలోనే వాజేడు, వెంకటాపురం మండలాల నిర్వహణ కొనసాగేది. తరువాత అటవీ శాఖ వాజేడు, దూలపురం రేంజ్‌లను ఏర్పాటు చేసింది. కానీ, ఇక్కడ రేంజ్ కార్యాలయ నిర్మాణం చేపట్టకపోవడంతో వెంకటాపురం మండలం నుంచి వాజేడు రేంజ్ కార్యాలయం నిర్వహణ కొనసాగగా, దూలపురం రేంజ్ కార్యాలయం నిర్వహణ వాజేడు మండలంలోని ఘణపురం కాలనీలోని ఖాళీగా ఉన్న అటవీశాఖ భవనంలో కొనసాగింది. గత ఏప్రిల్‌లో దూలపురం అటవీశాఖ రేంజ్ అధికారిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేసి వాజేడు అటవీశాఖ అధికారి చంద్రమౌళికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. దీంతో వాజేడు, దూలపురం అటవీశాఖ రేంజ్ కార్యాలయాల నిర్వహణ ప్రస్తుతం వెంకటాపురం మండలం నుంచి కొనసాగుతోంది. వాజేడులో రేంజ్ కార్యాలయం లేకపోవడంతో అధికారులు 20కిలోమీటర్ల దూరంలో ఉన్న వెంకటాపురం రేంజ్ కార్యాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

బీట్ ఆఫీసర్ల పోస్టులు ఖాళీ..

వాజేడు అటవీశాఖ రేంజ్ కార్యాలయం పరిధిలో కృష్ణాపురం, చెరుకూరు, పూసూరు, కడెకల్ సెక్షన్‌లు ఉన్నాయి. దూలపురం రేంజ్ కార్యాలయం పరిధిలో గుట్టలపై ఉన్న పెనుగోలు, కొప్పుసూరు, గుమ్మడిదొడ్డి సెక్షన్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో పలు బీట్లు ఉన్నాయి. వాజేడు రేంజ్ పరిధిలోని పూసూరు సెక్షన్ మినహా కడెకల్ సెక్షన్‌లో ఆరు బీట్ ఆఫీసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కృష్ణాపురం సెక్షన్‌లో మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చెరుకూరు సెక్షన్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉండడంతో కృష్ణాపురం సెక్షన్ ఆఫీసర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు ఎఫ్ఆర్వో చంద్రమౌళి తెలిపారు. దూలపురం రేంజ్‌లో బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దూలపురం అటవీశాఖ రేంజ్ పరిధిలోని ఘణపురం కాలనీ గ్రామంలో అటవీశాఖ అధికారులు నివాసముండేందుకు రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. అధికారులు ఎవరూ నివాసముండకపోవడంతో శిథిలావస్థకు చేరి, పిచ్చి మొక్కలతో పేరుకుపోయాయి.

కలప అక్రమ రవాణా..

అధికారులు స్థానికంగా ఉండకపోవడంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన అక్రమార్కులు కలపను అక్రమంగా తరలించుకపోతున్నారు. రహస్య ప్రాంతాల్లో కొందరు వివిధ డిజైన్లతో కలప వస్తువులు తయారు చేసి రాత్రి సమయాల్లో తరలించి సొమ్ముచేసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి అడవుల సంరక్షణపై ప్రత్యేక దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై వాజేడు, దూలపురం అటవీశాఖ రేంజ్ అధికారి చంద్రమౌళిని 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా కొన్ని చోట్ల ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఉన్న అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. ఎక్కడైనా కలప అక్రమ నిల్వలు ఉన్నా, తరలించినా వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

కేటీపీపీ గేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సింగరేణి భాగస్వామ్యాన్ని అంగీకరించం

- థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాలను జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలి
- నల్ల బ్యాడ్జీలతో కేటీపీపీ ఉద్యోగుల నిరసన

గణపురం/ కాళేశ్వరం, అక్టోబర్ 5: థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాలను జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని, సింగరేణి భాగస్వామ్యాన్ని అంగీకరించమని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. గణపురం మండలం చెల్పూరులోని కేటీపీపీలో శనివారం ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. అలాగే కాళేశ్వరంలోని ఇన్‌టేక్ వెల్ పంప్‌హౌస్ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేటీపీపీ ఉద్యోగులు మాట్లాడుతూ సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థ అయినప్పటికీ స్వతహాగా వారి స్థలాల్లో విద్యుత్ ప్లాంట్లు నిర్మించుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. రామగుండంలోని 550 ఎకరాల భూమి జెన్‌కోకు సంబంధించినదని, సింగరేణికి వాటా ఇవ్వడాన్ని తాము అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. సరిపోయేంత భూమి, బొగ్గు నిల్వలు, మ్యూన్ పవర్ కలిగి ఉన్న దృష్ట్యా రామగుండం పవర్ ప్లాంట్ తక్కువ ఖర్చుతో పూర్తవుతుందని, తద్వారా బ్యాలెన్స్ షీట్స్ సరిచేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని వారు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జెన్‌కోకు సంబంధించిన సొంత స్థలాల్లో జెన్‌కో యాజమాన్యమే ప్లాంటు నిర్మాణాలను చేపట్టేందుకు సహకరించాలని వారన్నారు. కార్యక్రమాల్లో ఏడీఈ కొలిపాక శ్రీనివాస్, ఏఈ కంది విజయ్‌కుమార్, ఉద్యోగులు కుమారస్వామి, జీ తిరుపతిరెడ్డి, సురేశ్, మహేశ్, సత్తిరెడ్డి, ప్రభాకర్, శరీన్, హరీశ్, జగదీశ్, శ్రీదేవి, గట్టక్క, గడ్డం శ్రీనివాస్, సందీప్ పాల్గొన్నారు.

కాళేశ్వరం ఇన్‌టేక్ వెల్ పంప్‌హౌస్ వద్ద ఉద్యోగుల నిరసన

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలిని కలిసిన రవీందర్

గండ్ర జ్యోతికి పుష్పగుచ్ఛం ఇస్తున్న రవీందర్, చిత్రంలో నాయకులు

కృష్ణకాలనీ, అక్టోబర్ 5: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతిని పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ చిట్యాల మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఆయన శనివారం భూపాలపల్లిలో జ్యోతిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ పటిష్టతకు పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నూనె రాజు పటేల్, అర్బన్ యూత్ అధ్యక్షుడు బుర్ర రాజు, గణపురం పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, చిట్యాల మండల యూత్ అధ్యక్షుడు నవీన్, మండల నాయకులు వీరస్వామి, పిట్ట సురేశ్, రవీందర్, అర్బన్ నాయకులు శ్రీకాంత్ పటేల్, అమృత అశోక్ పాల్గొన్నారు.

బీజేపీ విధానాలను తిప్పి కొట్టాలి

కృష్ణకాలనీ, అక్టోబర్ 5 : బీజేపీ మతోన్మాద ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు అన్నారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు వెలిశెట్టి రాజయ్య అధ్యక్షతన భూపాలపల్లి మండల నాల్గో మహా సభలు నిర్వహించగా సాయిలు హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులు, ఆదివాసీలు, కార్మికులు, పేదలపై దాడులు దౌర్జన్యాలు కొనసాగిస్తూ ప్రజల్లో హింసను ప్రేరేపిస్తున్నదన్నారు. అలాగే గత ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ సభ్యులు ఆకుదారు రమేశ్, గడప శేఖర్, మేకల మహేందర్, శిలుముల రవికుమార్, మాదాసు గోపాల్, వీ రమ, బీ శారద, వసుంధర, గాజుల రాధ, నీలాల లక్ష్మీనారాయణ, చిలుక భిక్షపతి, శంకరమూర్తి పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో బతుకమ్మ వేడుకలు

కృష్ణకాలనీ, అక్టోబర్ 5: జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్ట్ ప్రాంగణంలో శనివారం బతుకమ్మ ఉత్సవం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణ బాబు, న్యాయవాదులు, కోర్టు సిబ